## 1983 ఉగాది కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ!

ఆ పుస్తకం పేరు చూడగానే నవ్వొచ్చింది గోపాలకృష్ణకి. 'ఎగ్జిక్యూటివ్! నిన్ను నువ్వే చంపుకుంటున్నావా?' అని అలవాటు ప్రకారం తెలుగులోకి అనువాదం చేసింది అతని బుర్ర ఇంగ్లీషులో వున్న ఆ పేరుని.

'ఎగ్జిక్యూటివ్ అన్నమాటేమిటి ఈ ప్రశ్న ఎవరికేనా వర్తిస్తుంది' అనుకుంటూ ఆ పుస్తకాన్ని బుక్‌స్టాల్ రేక్‌లోంచి తీశాడు. ఓ పేద కుటుంబం వారం రోజుల గ్రాసం. అంత ధర చూసి మళ్ళీ పుస్తకాన్ని రేక్‌లో పెట్టేశాడు.

ఆ పుస్తకం కొనటమా.మానటమా అని మరికాస్సేపు ఆలోచించేవాడే....కానీ తప్పనిసరి పని టైముకి వెళ్ళాలి. అందుకని అక్కడ్నుంచి ముందుకి వచ్చేశాడు గోపాలకృష్ణ.

అక్కడ నుంచి వచ్చేసినా పుస్తకంమీద మనసు పీకుతోంది.'అయినా ఆ పుస్తకంలో మాత్రం ఏముంటుందిలే. నువ్వెవరు? మనిషివి. రోజుకి ఎన్ని గంటలు పని చెయ్యగలవు.... ఎంత ఎక్కువ పని చేస్తున్నావు. నీ వయసెంత. నీ ఆరోగ్యం గురించి జాగ్రత్త పడుతున్నావా? నీ శ్రమ ఎవరికి ఎలా లాభిస్తోందో ఆలోచించావా? దాని విలువెంతో తెలుసా? అంతే ఇలాంటివే ఉంటాయి' అనుకున్నాడు వుపశాంతిగా....

రిక్షాలో నిటారుగా కూర్చుంటే సింహాసనం మీద కూర్చున్నట్టుంది. బెజవాడ రిక్షాలు కొత్తేం కాదు గోపాలకృష్ణకి. ప్రతి మూడు నెలలకి కనీసం ఒక్కసారయినా అక్కడికి రాక తప్పదు.అతని బిజినెస్ ఏరియాకి బెజవాడ కీలక స్థానం. వచ్చినప్పుడల్లా టెన్షన్ తప్పదు. ఈసారీ అలాగే వుంది. అవసరానవసరాలతో సంబంధం లేకుండా చాలా ఆలోచనలు బుర్రలో ప్రయాణం చేస్తున్నాయి. రోడ్లన్నీ చికాగ్గా, చీదరగా అనిపిస్తున్నాయి.

"బెజవాడ బావుంటుందా బావుండదా?" ఇదివరకు చాలాసార్లు వచ్చిందీ ఆలోచన గోపాలకృష్ణకి. కాస్సేపు బావున్నట్టు వుంటుంది. మరికాస్సేపు దానికి భిన్నంగా వుంటుంది. 'ఎగ్జిక్యూటివ్!నిన్ను నువ్వే' మళ్ళీ పుస్తకం గుర్తొచ్చింది.

"ఇంతకీ నేను ఎగ్జిక్యూటివ్ నేనా"అనిపించింది మరునిముషం గోపాలకృష్ణకి. కొన్ని కంపెనీల టర్నోవర్ కోట్లలో వుంటుంది. కానీ అతను పనిచేసే కంపెనీ వ్యవహారం లక్షల్లోనే వుంది.పెద్ద ఎగ్జిక్యూటివ్స్ ఖర్చయినా ఆదాయం అయినా వేలు దాటితేనే గట్టిగా పట్టించుకుంటారు. కానీ గోపాలకృష్ణకి వంద రూపాయలంటే కొంచం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన మొత్తమే. అలా ఆలోచన సాగుతుంటే తననితనే చెక్ చేసుకున్నాడు గోపాలకృష్ణ

'ఎందుకులెద్దూ. వెధవ ఆలోచన. సరదాగా, సంతోషంగా వుండేదేదో ఆలోచించుకోక....' అనుకున్నాడు.


బెజవాడలో అతని సరదాకి, సంతోషానికి కేంద్రం సరోజ. సరోజ అనుకోగానే అతని కళ్ళముందు ఆమె ముఖం మెదిలింది....గుండ్రటి ముఖం....ముఖం కిందగా చక్కటి మెడ....మెడ వొంపు పక్కన చేతులు నిండుగా-స్పృశించగలిగిన భుజాలు....ఆలోచనని యింక ముందుకి సాగనియ్యలేదు గోపాలకృష్ణ....'ముందు బిజినెస్....' అనుకున్నాడతను. అప్పుడు వెడుతున్న హరిని గుర్తు తెచ్చుకుంటూ....


పద్ధతి.మాటలు....వ్యవహారం....అంతా మామూలే.... పని జరుగుతుంది.... సందేహం లేదు.... ఎటొచ్చీ తేడా అల్లా అంకెల్లోనే .... టెన్సన్ అంతా ఆ అంకెల గురించే. ఆ ట్రిప్పుకి తను సాధించగలిగిన బిజినెస్. దానికిగాను పెట్టాల్సిన ఖర్చు. అది పోను అతనికి మిగిలే కమిషన్ అంతా ఆ గంటా, రెండు గంటల మాటల్లో తేలిపోతుంది. మాట తూలినా, మాటా మాటా పెరిగినా ఫలితం నష్టమే.

గోపాలకృష్ణ పనిచేస్తున్న సంస్థ పేరు హేపీ హోమ్. అరడజను పైగా వస్తువులు అమ్ముతోంది ఆ కంపెనీ. అన్నీ మధ్యతరగతి కుటుంబాలకి అవసరమైన వస్తువులే.గోపాలకృష్ణ ఈ ఏరియాకి సేల్స్ ఎగ్జిక్యూటివ్. జీతం కాక సేల్స్ టార్గెట్ పైన చేసిన వ్యాపారానికి కమీషన్ కూడా వస్తుంది. పోతే అయ్యే ఖర్చంతా గోపాలకృష్ణే భరించాలి.కంపెనీకి సంబంధం లేదు. అందుకే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆర్డర్ సంపాదించాలన్నది అతని నిరంతర తాపత్రయం.

బెజవాడలో గోపాలకృష్ణ డీల్ చేసేది ఒక్క హరితోటే. అతనితో వ్యవహారం అయిపోతే యించుమించు ఆ జిల్లా వ్యాపారం అయిపోయినట్టే . ప్రతిసారీ ఏదో మెలిక పెడుతుంటాడు హరి.ఆ మెలికనుంచి తప్పుకోడం.వ్యవహారం తేల్చుకోటం ప్రతిసారీ తలనెప్పే గోపాలకృష్ణకి. అయినా తప్పదు పెద్ద డీలర్.

నిజానికి హరికీ అది సొంత వ్యాపారం కాదు. ఆ వూళ్ళో ఆ డీలర్‌షిప్ వున్న షాపుకి మేనేజర్ హరి. షాపు యజమానికి అనేక వ్యవహారాలు. అందుకే షాపుమీద వచ్చే లాభం తప్ప మరేం పట్టించుకోడు. దానివల్ల పూర్తి అధికారం అంతా హరి






చేతుల్లోనే వుంది. ఈ వివరం గోపాలకృష్ణకీ తెలుసు.

రిక్షా గమ్యం చేరింది. షాపు జనంతో కొంచం హడావిడిగానే వుంది. గోపాలకృష్ణని చూడగానే విష్ చేసి "కూచో గురూ. ఒక్క పది నిముషాలు" అన్నాడు హరి.

ఎప్పుడూ వూళ్ళోకి రాగానే హరికి ఫోన్ చేస్తాడు. ఇవాళా చేశాడు. అనుకున్న ప్రకారం టైముకి వచ్చాడు. అయినా ప్రతిసారీ పావుగంటో. అరగంటో వెయిట్ చెయ్యక తప్పదు. తన వృత్తికి వోర్పు. వోపిక అవసరం అని తెలిసినా ఒక్కోసారి విసుగ్గా వుంటుంది. ప్రతిసారీ అవే ట్రిప్పులు అదే కార్యక్రమం. అవే మాటలు. వ్యవహారం తేలేవరకూ అదే అలజడి. ఈవూరు కాకపోతే మరో వూరు. ఇంతయినా బతుకు బాగుపడుతున్నది లేదు.

దీనికి తోడు మేడిపండులా పైకి చూపించాల్సిన హుందా. నవ్వుముఖం. నీట్‌నెస్. వాటికి అదనపు ఖర్చు. అదనపు టెన్షన్ - పైకి నటించే ధీమా అడుగున ప్రతిక్షణం జంకే - పెర్మనెన్సీ లేని ఉద్యోగం. రెండు నెలల జీతం లేదా నోటీస్ తప్ప మరేం భద్రత లేని బతుకు.

ఏ రోజుకారోజు గడపడం కప్పదాటులా అలజడి నుంచి తాత్కాలికంగా బైటపట్టమే నిత్య జీవితం అయింవని తెలుసు. తెలిసినా సరిపెట్టుకుంటున్నా.... కాని కరుకు నిజాల్నించి తప్పించుకోలేకపోతున్నా, ఫ గోపాలకృష్ణ.

ముప్ఫైఅయిదేళ్ళవయసొచ్చిన తన శరీరం....యింకా పెళ్ళి చేయాల్సిన చెల్లెలు. చదువుకుంటున్న తమ్ముడు....కనీసం మరి కొన్నేళ్ళయినా గడిస్తేతప్ప తీరని కుటుంబ బాధ్యతలు.... వీటన్నింటికన్నా ఎక్కువగా యీ అస్థిరమైన బతుకుతో ఏ రకంగానూ స్థిరపడలేని జీవితం. యీ నిజాలన్నీ విడివిడిగానూ. ఒక్కోసారి కలివిడిగానూ కూడా బాధపెడుతున్నాయి గోపాలకృష్ణని.

వీటికితోడు పనిచేస్తున్న కంపెనీ వ్యవహారం. సేల్స్‌టార్గెట్స్. మరింతగా కష్టపడి మరింతగా సంపాదించాలన్న తపన. ఖర్చు తగ్గించి కొద్దో గొప్పో వెనకేసి ఇప్పుడు కాకపోతే మరో పదేళ్ళకేనా ఆర్థికంగా స్థిరపడి ఈ అలజడి తిరుగుడు బతుకునుంచి

విముక్తి పొందాలన్న ఆరాటం.

కూర్చున్న గోపాలకృష్ణకి లోపల,బైటా కూడా ఆరాటంగా వుంది. షాపులో హడా విడి తగ్గటంలేదు.

యీ ట్రిప్పైనా చాలా పొదుపుగా వుండాలనుకున్నాడు కానీ కుదరలేదు. కిందటిసారి తిరిగిన వూళ్ళే.... అయినా ఖర్చు ఎక్కువైంది. కిందటిసారి కన్నా వంద పైగానే ఎక్కువగా ఖర్చయింది.... అదనంగా అనుభవించిందేంలేదు.... అన్ని చోట్లా రేట్లు పెరిగాయి.. అదే తేడా.. ఇంకా యీ హరి వ్యవహారం తేలాలి. ఇక్కడెంత ఖర్చవుతుందో....

హరి బైటపట్టానికి మరో అరగంట పట్టింది. యిద్దరూ బార్ చేరటానికి మరో పావుగంట. పలకరింపులు నవ్వులూ అయి స్థిరపడి వ్యవహారంలోకి దిగటానికి మరో పావుగంట.

"ఈసారి కొంచెం గట్టి చిక్కే వచ్చింది గురూ" అన్నాడు హరి ఓ రౌండ్ పూర్తి చేసి.

ప్రతిసారీ ఏదో చిక్కు చెపుతూనే వుంటాడు హరి. వింటానికి సిద్ధంగానే వున్నాడు గోపాలకృష్ణ. గోపాలకృష్ణ కంపెనీ సప్లైచేసే ప్రొడక్ట్సే కోయంబత్తూరు వాళ్ళు సప్లై చేస్తామని వచ్చారని. వాళ్ళ డిస్కౌంట్ ఎక్కువగా వుందని. రేంజీ. నాణ్యతా బావున్నాయనీ. కావాలంటే వాళ్ళ లిటరేచరంతా బ్రీఫ్‌లో వుంది చూపెడతానని అన్నాడు హరి. గోపాలకృష్ణ వద్దంటున్నా వినకుండా ఆ కాయితాలన్నీ తీసి చూపించాడు.

మరో అరగంట చర్చ తర్వాత హరి తేల్చిందేమిటంటే కోయంబత్తూరు పార్టీని తమ షాప్ ఛాయలకి రాకుండా చేసి యిదివరకటిలాగే వ్యవహారం నడపటానికి తన కమీషన్ క్వార్టర్‌కి కనీసం నాలుగొందలేనా పెంచమని....గట్టి చిక్కే ఎదురైంది గోపాలకృష్ణకి.

చివరికి రెండొందలకి బేరం కుదిరింది. అంటే ప్రతి మూడునెలలకి గోపాలకృష్ణకి అదనంగా రెండొందలు ఖర్చు. అయినా తప్పదు. మార్కెట్లో కాంపిటీషన్ బాగా ఎక్కువగా వుంది. హరిలాంటి మధ్యమనిషి అవసరం వుంది. అలాంటివాళ్ళు చెయ్యిజారిపోతే లాభంలేదు. ఈ దరిద్రం తప్పదు. రోజురోజుకి శ్రమ పెరుగుతోంది తప్ప విలువ పెరగటంలేదు. బతుకు పెరగటం లేదు.

"చూడు హరీ యీ సారికి వొప్పుకుంటున్నాను. వచ్చిన ప్రతిసారీ యిలా ఏదో మెలికేస్తే నే చచ్చిపోతాను. ప్రతి క్వార్టర్‌కి కంపెనీ వాళ్ళు సేల్స్‌టార్గెట్ పెంచి చంపుతున్నారు. వుద్యోగం నిలబెట్టుకోడానికి యీ తంటాలన్నీ....వాళ్ళిచ్చే జీతంలోంచే నేనీ ఖర్చంతా తట్టుకోవాలి. రేటు పెంచితే పెంచావు. అన్నిచోట్లా రేట్లు పెరిగాయి. కనీసం ఆర్డరేనా బాగా పెంచు" అన్నాడు గోపాలకృష్ణ చివరికి రాని నవ్వు తెచ్చుకుంటూ.

"అంతగా నువ్వు చెప్పాలా. అలాగేలే గురూ"అన్నాడు హరి బాయ్‌ని పిలిచి మరో సిప్ చెపుతూ.


"చూడుగురూ.... లివ్వింగ్ కాస్ట్లీ అయిపోయింది. అవకాశం వున్నప్పుడే ఆదాయం పెంచుకోవాలి. నాకు మాత్రం తెలియదా, ప్రతిసారీ నిన్ను ఎందుకు యిబ్బంది పెడతాను" అన్నాడు హరి.

ఆ బార్ దాటి బైటపడే టప్పటికి రాత్రి పదకొండు దాటింది.ఖర్చు మామూలుకన్నా ఎక్కువే అయింది. అయినా అంత అసంతృప్తిగా లేదు. కోయంబత్తూరు వ్యవహారం హరి చెబుతున్నప్పుడు మొత్తం డీలే పడైపోతుందేమో అనిపించింది. మొత్తానికి వ్యవహారం చెడిపోలేదు. అదీ తృప్తి.కొద్దో గొప్పో ఆర్డర్ పెంచకపోడు హరి.

## 'కవి' నిర్వచనాలు

తిక్కన్న : నీవు వినా తెలుగు సున్న
నాచన సోముడు : శిల్ప సౌధాలపై వెలిగే శేముషీ ధీముడు
పోతన్న : తెలుగు తనపు తరగని వెన్న
రాయలు : శిలసశిలల్లో ప్రవహించే జనపదం హొయలు
అల్లసాని : అక్షరాల్ని కాలి అందెలు చేసిన రసమౌని
ధూర్జటి : మరులు గొల్పే మహర్వాటి
తెనాలి వాడు : వజ్రలోకంలో వలపుల వీడు
భట్టుమూర్తి : పద్యాల్ని సంగీతంలో ముంచిన స్వరస్ఫూర్తి
నంది తిమ్మన : తాకితే కందిపోయే చిగురు కొన!
చేమకూర : తంజావూరి 'గోంగూర'
గురజాడ : కొత్తలోకాలకు తలుపు తట్టిన నీడ
శ్రీశ్రీ : గతానికి పాడిన మంగళ మహాశ్రీ
తిలకు : కన్నీటి కొలకు
నగ్నముని : అగ్నిఖని

—సౌభాగ్య




అది చాల్లే అనిపించింది. పరిస్థితుల మార్పుకి కీలకం తనబోటి సామాన్యుడి చేతుల్లోలేదని తెలుసు. టెన్షన్‌కి, శ్రమకి తగిన ఫలితం దక్కలేదని బాధగా వున్నా బాధపడకూడదనుకున్నాడు. ఆ విషయం మరిచిపోవాలనుకున్నాడు. ఆ క్షణాన మిగిలిందల్లా అలసటే గోపాలకృష్ణకి. అందుకే ఆ అలసటని మరిచిపోవాలని నిర్ణయించుకున్నాడు.

* * *

మిగిలున్న ఆ రాత్రి తను కష్టపడి సంపాదించుకున్న ఆస్థిలా వుంది గోపాలకృష్ణకి. అంతకు ముందులా హడావిడిగా, చిరాగ్గా కనపడలేదు బెజవాడ రోడ్లు. రిక్షాలో కూచుంటే నిజంగా సింహాసనం మీద కూచున్నట్లే వుంది.

రిక్షా ఆ సందు తిరుగుతుంటే మాత్రం ఒక్కక్షణం ఆతృత పడింది అతని మనసు సరోజ ఉంటుందో వుండదో అని.

సరోజ వుంది. అందులోనూ తీరుబడిగానే వుంది. ఆ రాత్రితో సరోజతో అతని శరీరం ఆనంద పడింది. రెండు నెలల తాత్కాలిక బ్రహ్మచర్యం ఆ రాత్రిలో కరిగింది. తిరిగి మళ్ళీ బెజవాడ వచ్చేవరకూ చాలు అన్నంతగా ఉపశమనం పొందింది అతని మనసు.




అనుభవంలోనూ, ఆనందంలోనూ తేడా లేకపోయినా సరోజ తేడాగా వున్నట్టనిపించింది గోపాలకృష్ణకి. మనిషి చిక్కింది. నవ్వుతూ, సరదాగానే వున్నా యిదివరకటంత నిండుగా లేదు మనిషి.

"ఏం అలా వున్నావేం...." అనడిగాడు గోపాలకృష్ణ చివరికి.

"ఏంలేదు....బాగానే వున్నానే" అంది సరోజ.

అంతే యింకేం అడగలేకపోయాడు గోపాలకృష్ణ. రెండు నెలలకో, మూడు నెలలకో వో రాత్రి....ఆ రాత్రికి వో వంద రూపాయలు. అదీ సంబంధం యిద్దరికీ.... సరోజ గురించి చూచాయగా తెలుసు గోపాలకృష్ణకి....భర్తలేనిబతుకు సరోజది. కూతుర్ని చదివిస్తూ ఆ పిల్ల భవిష్యత్తుమీద మినుకుమినుకుమనేఆశతో బతుకుతున్నజీవితం....సరైన సంపాదన, స్థిరమైన వుద్యోగం లేక తనలాంటి కొందరితో యిలా గడుపుతున్న బతుకు.... అంతకు మించి

ఒత్తుగా, నిగనిగలాడే,
ఆరోగ్యకరమైన కేశములకొరకు

స్వస్తిక్
పెర్‌ఫ్యూమ్డ్
కేస్టర్
హెయిర్ ఆయిల్






రోజంతా మీ కేశములను అందంగా, దువ్వినవి దువ్వినట్లే ఉంచేందుకు— స్వస్తిక్ పెర్‌ఫ్యూమ్డ్ కేస్టర్ హెయిర్ ఆయిల్‌ను మీ కుటుంబంలోని వారందరూ మెచ్చుకొంటారు.

స్వస్తిక్ హౌస్‌హోల్డ్ అండ్ ఇండస్ట్రియల్ ప్రోడక్ట్స్, బొంబాయి.

shilpi dm 13/78 tel



స్క్రిప్ట్ ఆర్ట్స్ అపూర్వ రూపకల్పన
బర్త్ డే కేకులు, కొండిల్స్, పూలు పళ్ళు పొదిగిన
బర్త్‌డే కార్డులు
మొగ్గలు తొడిగిన మమతలు
తెలుగు కార్డులలో లాలిపాటలు
అవసరమైనప్పుడు మీకు తెలిసిన షాపులలో విచారించండి.
లేవంటే-తెప్పించమనండి. ఈ కార్డులను పోస్టులో తెప్పించుకోవడం మీకు లాభసాటి కాదు.

SA/GC 84-4



**వాత్స్యాయన కామసూత్రాలు**

రచన : ధనికొండ

పద్మిని, చిత్తిని, శంఖిని, హస్తిని జాతుల స్త్రీ వర్ణనలతో (బొమ్మలతో) రతి రహస్యములు, చిత్రరతములు, ఆలింగన, చుంబన, నఖదంతక్షత, లైంగిక సంయోగ విశేషాలతోను, వశీకరణ యోగాల గురించి వ్రాయబడిన గ్రంథం.

త్రివర్ణ ముఖచిత్రం: వెల రూ.15/-

అడ్వాన్సు లేని ఆర్డర్లు పంపబడవు

బాల సరస్వతీ బుక్ డిపో

4. సుంకురామశెట్టి వీధి,
మద్రాసు—600 001.



సుప్రసిద్ధ నవలా రచయిత్రుల నవలలు
లల్లాదేవి
*కాలానికి నిలిచిన కథ -14/-
*ఆత్మ చెప్పిన కథ -15/-
గిరిజశ్రీభగవాన్
*ఆడపడుచులు మీకు జేజేలు-14/-
కథానాయకుడు కావాలి 14/-
కొమ్మూరి సాంబశివరావు
*రాగాలపల్లకి-14/-
పారిజాతసుమం-14/-
కలమందుల లేన్, విజయవాడ-1
శ్రీ నిఖిలేశ్వరి ప్రచురణలు


సరోజ వివరాలేం తెలియవు. ఆమె శరీరం తెలిసున్నంతగా ఆమె మనసు తెలియదు. ఆమె దగ్గర పొందే ఉపశమనం అంతగా సరోజ కష్టం. సుఖం తెలియవు. అడగాలంటే అడగొచ్చు అయినా అడగడు గోపాలకృష్ణ. అడిగి ఏంచెయ్యగలనన్న పిరికితనం.

తెల్లారుఝామున వెళ్ళిపోతూ పర్స్ లోంచి వంద తీసి యిచ్చాడు గోపాలకృష్ణ. అందుకుంది సరోజ.అలా అందుకుంటున్న సరోజ వేపు చూశాడు. ఆ కళ్ళు ఏం చెప్పటంలేదు. అయినా వూహించగలడు గోపాలకృష్ణ. కొద్ది మార్పు వున్నా వాత్తికి అదే. నిత్యం పదూళ్ళు తిరుగుతూ మాదుతున్న వ్యాపారం, రేట్లు చూస్తూ....

హరిలాంటి వాడి మెలికలికి తప్పుని సరిగా తలవొంచుతూన్న గోపాలకృష్ణ వూహించగలడు.

'ఏదేనా యిబ్బందుందేమో, అడిగితే బావుణ్ణు మరో యాభై యిద్దును. ఎలాగా ఈ ట్రిప్పులో ఖర్చు ఎక్కువే అయింది' అనుకున్నాడు వెళ్ళినచోటల్లా పెరిగినరేట్లు, ఖర్చు గుర్తు తెచ్చుకుని.

సరోజ అడగలేదు.

వీలున్నంతవరకూ ఖర్చు తగ్గించటమే బతుగ్గా భావించటానికి అలవాటుపడుతున్న గోపాలకృష్ణ ఆమె అడక్కుండా దబ్బివ్వలేకపోయాడు. తెలిసి తెలిసీ యాభై రూపాయల కక్కుర్తికి మనసుని అణచిపెట్టాడు. శరీరమైనా, శ్రమైనా కొనుక్కునేవాడు వాలంటరీగా రేటు పెంచలేదు. ఆ వ్యాపార సూత్రం యిక్కడా వర్తించింది.

'నేను మంచివాణ్ణా....మామూలు మనిషినా....వెధవనా?' అని చాలాసార్లు తనని తాను ప్రశ్నించుకున్నాడు గోపాలకృష్ణ. అన్నీ అనిపించింది.

'రోజురోజుకి జారిపోతున్న వయస్సే కానీ వస్తున్న వయసు కాదు. పూర్తిగా బజారున పడగలిగే బతుకూ కాదు. అవసరం వున్నా ఎక్కువ యిమ్మనమని ఏం అడగనూ—అడిగితే యీ రావటం కూడా, మానేస్తే.... మరెవర్నేనా చూసుకుంటే?' అనుకుంటూ మౌనంగా వుండిపోయింది, అతనంతగా అతనుయిస్తే బావుణ్ణని ఆశపడ్డ సరోజ.

వెళ్ళిపోతున్న గోపాలకృష్ణ వెనకే వీధి వరకూ వచ్చింది సరోజ. తెల్లవారుతున్న వుదయం. చల్లటిగాలి. మనుషులే లేని ప్రశాంత వాతావరణం. అయినా యిద్దరికీ హాయిగాలేదు. జరుగుతున్న ఖూనీని తప్పని సరిగా చూస్తున్నట్టుంది. ●

# సుభాషితాలు

మృతునికి నిజమైన స్మృతి మందిరం మనిషి హృదయమే. —జాక్రాక్టో

* * *

ఇష్టపడిన పనిచేయడం కంటె చేస్తున్న పనిమీద ఇష్టం పెంచుకోవడంవల్లనే బతుకులో ఆనందం పెరుగుతుంది.

—గెథే

* * *

మొదటి వాంఛ వెనుక ఉప్పతిల్లే వాంఛల పరంపరను నిరోధించడంకన్న, ప్రథమ వాంఛను తుంచడమే సులభతర కార్యము.

—లా రోష్ ఫౌకా

* * *

మనిషి రోజూ తల దువ్వుకుని చక్కదిద్దుకుంటాడు గదా? అలాగే తన హృదయాన్నీ ఎందుకు చక్కదిద్దుకోడు?

—చైనీస్ సామెత

* * *

ఒక మనిషి చదివే పుస్తకాలూ, చేసే స్నేహాలూ, ఒప్పుకొన్న తప్పులూ అతడి వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తాయి.

—ఒక సామెత

* * *

ప్రపంచానికి అసాధారణ మానవులే వికాసాన్ని ఇస్తారు, అయితే దీనికి స్థిరత్వాన్ని ఇచ్చేది సగటు మనుషులే.

—పాల్ వాలెరీ

* * *

స్వేచ్ఛాపూరితమైన పత్రికా ప్రపంచంలో మంచీ ఉండొచ్చు, చెడుగూ వుండొచ్చు. కానీ, స్వేచ్ఛ లోపిస్తే పత్రికలలో చెడుతప్ప మరేమీ వికసించదు.

—ఆల్బర్ట్ కామస్

* *

హాస్యపు జల్లు మనిషి మహనీయతకు నిర్వచనం. మనిషి బతుకు బాటలో ఎదురయే వస్తుగుణ జీవవిశేషాల మీద అతడి ఆధిక్యానికి హాస్యం విశిష్ట ప్రకటన.

—రోమన్ కారీ

సేకరణ :
వేదం సుశీలా శేఖరమ్